కాకినాడ శ్రీ ఆదిత్యలో క్విజ్ పోటీలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: స్థానిక కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలు సందర్భంగా కళాశాలలో క్విజ్ పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.వేణుగోపాల్ తెలియజేశారు. ముఖ్య అతిథులుగా కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ జిజివి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల నుండి 122 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇంటర్ విద్యార్థులకు జికె కరెంట్ అఫైర్స్, డిగ్రీ విద్యార్థులకు పర్యావరణ విద్య అనే అంశంపై పోటీలను నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలు లైబ్రరీ కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

విద్యార్థుల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పు

- ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ స్కూల్స్, కాలేజీ బస్సులతో ప్రమాదాలు
- స్కూల్, కాలేజీ బస్సులపై యాజమాన్యాల నిర్లక్ష్యం
- చర్యలు తీసుకోకుంటే పోరాటం
- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్న తరుణంలో విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తుందని తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా గ్రీవెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్, కాలేజీలు వాహన ఫిట్‌నెస్ నిబంధనలు పాటించకుండా అధిక సంఖ్యలో విద్యార్థులను రవాణా చేస్తున్నారని, ఈ బస్సులలో చాలా వరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండా నడుస్తున్నాయన్నారు. వాహనాల మరమ్మతులు చేయకుండా పాత వాహనాలనే ఉపయోగిస్తున్నారన్నారు. బస్సులలో అవసరమైన సేఫ్టీ స్టాండర్డ్స్ లేకుండా, అధిక సంఖ్యలో విద్యార్థులతో ఓవర్ లోడింగ్‌తో ఎక్కిస్తున్నారన్నారు. బస్సులు డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్లకు లైసెన్స్ అనుభవం లేకుండా డ్రైవింగ్ బాధ్యతలను అప్పగించే పరిస్థితి జిల్లాలో ఉందన్నారు. ఇలాంటి నిర్లక్ష్యం కారణంగా ఇటీవల అనేక ప్రాంతాల్లో పలు ప్రమాదాలు జరిగి విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని, ఇలాంటి సంఘటనలు జిల్లాలో జరగకుండా సంబంధిత అధికారులు తక్షణమే బస్సులపై దృష్టి సారించాలని కోరారు. ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్, ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్ కాలేజీ బస్సులను తక్షణమే తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విద్యాసంస్థలు రవాణాపై మోటార్ వెహికల్ యాక్ట్ నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయాలని, స్కూలు, కాలేజ్ నిర్వాహణలపై నిర్లక్ష్యం కనబరిస్తే కఠినమైన శాసనాత్మక చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక రోడ్డు భద్రత కమిటీని తక్షణం ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో అనేక పోరాటాలు నిర్వహిస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎస్.అన్నాజీ రావు, జి.వసంతరావు, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.8 కోట్లతో కోటబొమ్మాళి - సంతబొమ్మాళి రోడ్డు అభివృద్ధి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, రవాణా సౌకర్యాలు మెరుగుపడితేనే ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కోటబొమ్మాళి - సంతబొమ్మాళి రహదారి అభివృద్ధి పనులకు సోమవారం ఆయన లాంఛనంగా శంకుస్థాపన చేశారు. టెక్కలి నియోజకవర్గంలో రవాణా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో ఈ కీలక రహదారి పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. రూ.3.80 కోట్ల అంచనా వ్యయంతో ఎస్డైప్ ప్లాన్ నిధుల నుండి మంజూరైన ఈ అభివృద్ధి పనులను అత్యంత త్వరిత గతిన, నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు రెడ్డి అప్పన్న, సంతబొమ్మాళి పిఎసిఎస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు, మాజీ జెడ్పీటీసీ, కోటబొమ్మాళి ఏఎంసి వైస్ చైర్మన్ బాదాన వెంకటరమణమ్మ, సంతబొమ్మాళి నీటి సంఘం అధ్యక్షులు అల్లు రమేష్, ఏఎంసీ డైరెక్టర్లు సురాడ ధనరాజు, కర్రీ రామిరెడ్డి, చింతాడ భీమారావు, సంతబొమ్మాళి మాజీ సర్పంచ్ మెండ అప్పారావు, సంతబొమ్మాళి పంచాయతీ సర్పంచ్ కళింగపట్నం లక్ష్మీ అప్పారావు, సీనియర్ టీడీపీ నాయకులు చల్లా జగ్గారావు, మూలపేట పంచాయతీ సామాజిక కార్యకర్త జీరు నారంనాయుడు, మండల టిడిపి నాయకులు ఇన్ని గౌరీ నాయుడు, శవ్వాన ప్రసాదరావు ఆరంగి వసంతరావు, కర్రీ విష్ణుమూర్తి, ధర్మార్జు నారెడ్డి, ధూపాన రామారావు, శ్రీరంగం రాజులు, పిట్ట రాజులు, ఆర్ అండ్ బి ఎస్ఈ పి.సత్య నారాయణ, డిప్యూటీ ఈఈ తిరుపతిరావు, ఏఈఈ హరినాధరావు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసులు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని లేని పక్షంలో షోకాజ్ నోటీసులు ఇవ్వాల్సి వస్తుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను హెచ్చరించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి ఆయన అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కి ప్రతీ శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పలు శాఖలకు సంబంధించిన 120 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, రిటైర్డ్ జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, జి. జయదేవి, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్ లు ఉన్నారు. జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటలపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర - నరసన్నపేట: రబీ పంటలపై రైతులకు సోమవారం ఐద్య అగ్రి క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అవగాహన సదస్సును ఏర్పాటు చేసింది. పట్టణంలోని దేశవానిపేట, పోలాకి మండలంలోని కుసుమ పాలవలస గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఐద్య అగ్రిక్రాప్ కంపెనీ, టెరిటరీ మేనేజర్, ఎస్టీపీ. మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఈ రబీ సీజన్లో రైతులు ఆరుతడి పంటలైన మినుము, పెసర, నువ్వులు, మొక్కజొన్న, వేరుశనగ వేసుకోవాలని తెలిపారు. పంటలకు సస్యరక్షణలో భాగంగా ఎరువులను వేసుకోవాలని, మొక్కలకు చీడ పీడలు వచ్చినట్లయితే వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పురుగు మందులు పిచికారి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా కంపెనీకి చెందిన ఎరువులను, పురుగుమందులను, విత్తనాలను రైతులకు అందజేశారు. మరిన్ని వివరాలు కోసం సెల్ నెంబర్ - 9381530722, 9494907768కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులతోపాటు న్యూ శ్రీరామ రైతు డిపో ప్రతినిధి, మురళి పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు రాజీకి సహకరించండి

విశాలాంధ్ర-టెక్కలి: జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి అందరూ సహకరించాలని సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక కోర్టు ఆవరణంలో సోమవారం న్యాయవాదులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చేనెల 13వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. రాజీ మార్గమే రాజ మార్గం అని నిర్మల అన్నారు. ఈ సమావేశంలో టెక్కలి కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, ఇతర న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

నీలకంటేశ్వర స్వామివారి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం: కార్తీక నాల్గో సోమవారం సందర్భంగా సోమవారం పాతపట్నం మండలం సోద గ్రామంలోని శ్రీ నీలకంటేశ్వర స్వామివారి 22వ వార్షికోత్సవ మహెూత్సవాలకి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు (ఎంజీఆర్) పాల్గొన్నారు. మహెూత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, నిర్వహించారు ఆలయంలో భజన కార్యక్రమంలో పాల్గొని అన్నదాన కార్యక్రమానికి పదివేల రూపాయలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను మింగేసిన కిడ్నీ భూతం

ఆపన్నహస్తం కోసం చిన్నారుల ఎదురు చూపులు



విశాలాంధ్ర - కవిటి: తల్లిదండ్రుల అలనా, పాలనలో అల్లారుముద్దుగా పెరగాల్సిన ఆ చిన్నారులపై విధి పగబట్టింది. కిడ్నీ భూతం ఆ కుటుంబాన్ని చిదిమేసింది. ఆ ఇద్దరు చిన్నారులు అమ్మనాన్నల ప్రేమకు దూరమై దయనీయ పరిస్థితులో కొట్టుమిట్టాడతున్నారు. తినడానికి సరైన తిండి, ధరించడానికి మంచి దుస్తులు లేక తమ బాధలెవరికి చెప్పుకోవాలో తెలియని దయనీయ స్థితిలో ఉన్నారు.

కుటుంబం చిన్నా భిన్నం..

కవిటి మండలం బి.గొనప పుట్టుగ గ్రామానికి చెందిన బడగల శివాజీ, కళావతి దంపతులకు చరణ్ (ఇంటర్ రెండవ సంవత్సరం), అనన్య (3వ తరగతి) చదువుతున్నారు. తల్లిదండ్రులతో అల్లారు ముద్దుగా పెరిగిన వీరి జీవితంలో కిడ్నీ భూతం ఆ ఆనందాన్ని దూరం చేసింది. తల్లిదండ్రులు ఇద్దరు కిడ్నీ వ్యాధికి గురికావడంతో ఆ కుటుంబం చితికిపోయింది. నాన్న శివాజీ సుమారు మూడేళ్ల క్రితం మరణిస్తే తల్లి కళావతి వారం రోజుల క్రితం మరణించడంతో బతుకుభారంగా గడుపుతున్నారు. అప్పటి వరకు అమ్మకు వచ్చిన రూ.10 వేల పింఛనుతో ఆమె డయాలసిస్ ఖర్చులు, ఇంటి ఖర్చులు చేసుకునేవారు. ఇప్పుడు ఎలా బ్రతకాలని రోధిస్తున్నారు. దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

విశాలాంధ్ర - కొత్తూరు: జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా శాఖా గ్రంథాలయంలో వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉదయం 6,7,8 తరగతుల విద్యార్థులకు, మధ్యాహ్నం 9,10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందిస్తామని శాఖా గ్రంథాలయ అధికారి ఇందిరా మీడియాకు తెలిపారు.

పాఠశాలను సందర్శించిన సర్పంచ్

విశాలాంధ్ర-రణస్థలం: మండలం రణస్థలం గ్రామంలో గల మండల ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజి నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పిల్లలకు ఇస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ముఖ్యంగా ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చూసిన, వెంటనే పాఠశాల ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు తెలియపరచాలని చెప్పారు. వీరితోపాటు పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

హెల్పింగ్ హాండ్స్ సభ్యులు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం గొండ్యాల పుట్టుగ గ్రామంలో ఇటీవల మరణించిన రమేష్కు ముగ్గురు చిన్నారులు ఉండడంతో జీఎస్ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు సోమవారం రూ.6 వేలు ఆర్థిక సాయంను చిన్నారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు, గ్రామ పెద్దలు,యువకులు పాల్గొన్నారు.

19న జీవనోపాధి, స్వయం ఉపాధి పథకాలపై వర్క్ షాప్

విశాలాంధ్ర-మెలియాపుట్టి: జీవనోపాధి, స్వయం ఉపాధి పథకాల అర్హత ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు ఈనెల 19వ తేదీ బుధవారం సీతంపేట ఐటిడిఏలో ఈ పథకాలపై వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుందని ఐటిడిఏ పీవో పవార్ స్వప్నిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఐటీడీఏలో జరగనున్న ఈ వర్క్ షాప్ కార్యక్రమంలో జీవనోపాధి, స్వయం ఉపాధి అవకాశాలు, వివిధ ప్రభుత్వ పథకాలు, బ్యాంకు ఋణ, రాయితీలపై ఆసక్తి కలిగిన గిరిజన యువతీ, యువకులకు అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. 10వ తరగతి నుండి పీజీ వరకు చదువుకొని విద్యార్హత కలిగిన వారు తమ యొక్క ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్, పాస్ పోర్ట్ ఫోటోస్‌తో హాజరుకావాలన్నారు. ఆసక్తి కలిగిన గిరిజన యువతీ యువకులు, ఎస్‌హెచ్‌జి, వీడివీకే సభ్యులు, వర్క్ షాప్‌కు హాజరుకావాలని పీవో తెలియజేశారు.

పరిశోధనా ప్రవేశాల్లో మార్పులు అవసరం

- అంబేద్కర్ వర్సిటీ వీసీ ఆచార్య కె.ఆర్.రజని

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: పరిశోధనా ప్రవేశాల్లో కొన్ని మార్పులు అవసరమని డా. బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ వైస్- ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని అభిప్రాయపడ్డారు. హైబ్రిడ్ మోడ్(ఆఫ్లైన్, ఆన్లైన్)లో సోమవారం వీసీ అధ్యక్షతన జరిగిన వర్శిటీ బోర్డ్ ఆఫ్ రీసెర్చ్ స్టడీస్(బీఆర్ఎస్) సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రవేశాలు పారదర్శకంగా ఉండాలని సూచించారు. పరిశోధనా కేంద్రాలు మంజూరు, యూజీసీ నెట్ మరియు ఫెలోషిప్ పొందిన వారికి పరిశోధన ప్రవేశాలకు మార్గం సుగమం చేయాలని బీఆర్ఎస్ సభ్యులను ఈ సందర్భంగా వీసీ కోరారు. అదేవిధంగా ఎగ్జిక్యూటివ్ కోటాలో స్కాలర్‌గా చేరాలని ఆసక్తి గలవారికి అర్హతల మేరకు పరిశోధనా ప్రవేశాలు కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో, వివిధ విభాగాల పరిశోధనా సంబంధిత సబ్జెక్టు, ఎక్స్టెర్న్ నిపుణులు ఆచార్య పి.అర్జున్, ఆచార్య ఎం.వి.బసవేశ్వరరావు, ఆచార్య అనురాధ కామేశ్వరి, ఆచార్య బి.మునిస్వామి నాయుడు, ఆచార్య మంజులా డేవిడ్సన్, ఆచార్య వి. శ్రీమన్నారాయణ, ఆచార్య బి. అడ్డయ్య మరియు ఆచార్య పి.సుజాత తదితరులు పాల్గొన్నారు. వర్శిటీ అకడమిక్ అఫైర్స్ డీన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.స్వప్నవాహిని సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమాశానికి వర్శిటీ అధికారులు డా. ఎం.అనురాధ, డా. ఎస్.లోకేశ్వరి, డా. యు.కావ్యజ్యోత్స్న తదితరులు హాజరయ్యారు.

విభిన్న ప్రతిభావంతులకు స్పెషల్ రిక్రూట్మెంట్ డ్రైవ్

విశాలాంధ్ర-ఆమదాలవలస: విభిన్న ప్రతిభా వంతులకు కేటాయించిన బ్యాక్ లాగ్ ఖాళీలను స్పెషల్ రిక్రూట్మెంట్ డ్రైవ్ దరఖాస్తుకు 2026 మార్చి 31వ తేదీ వరకు అవకాశం కలిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్యే పియు సి చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని విభిన్న ప్రతిభావంతులు సద్వినియో గపరచు కోవాలని తెలిపారు. అలాగే డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ విజయవాడలో బీఎస్సీ నర్సింగ్‌లో కాంపిటెంట్ అథారిటీ కోట ఖాళీ సీట్లలో ప్రవేశాలకు నవంబర్ 18 మధ్యాహ్నం 3 గంటల వరకు ఆన్లైన్ దరఖాస్తులకు అవకాశం కల్పి స్తున్నట్లు వివరించారు. బీఎస్సీ నర్సింగ్ కోర్స్ చదవా లనుకునే బీఎస్సీ నర్సింగ్ కోర్స్ చదవాలనుకునే అర్హు లైన వారు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసుల నిఘా నేత్రం

కళ్ళు మూసుకుందా...!

- సీసీ కెమెరాలు ద్వారా పోలీసులు పర్యవేక్షణ అసలు ఉందా...లేదా...!

విశాలాంధ్ర-టెక్కలి: మండల కేంద్రంలోని కొన్ని సమీప పరిసరాలలో పోలీసులు వివిధ సంఘటనలపై నిఘా పెట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారన్న విషయం అందరికీ విదితమే. అయితే ఈమధ్య కాలంలో సీసీ కెమెరాల ద్వారా పోలీసులు పర్యవేక్షణ ఉందో, లేకుండా పోయిందో అనే పరిస్థితి కనిపిస్తుంది. టెక్కలి టౌన్ మధ్యలో గల ఇందిరాగాంధీ కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చుట్టూ పెద్ద పెద్ద బ్యానర్లు కట్టడంతో కెమెరా లో దృశ్యాలు కు ఆటంకం కలగటం లేదా అనే గుసగుసలు సామాన్యుల నోటంతా వినపడుతున్నాయి. సామాన్యులు గుసగుసలాడమే గాని పోలీసు వారిని ప్రశ్నించే అధికారం వారికి లేకపోయే. నేరాలను ఛేదించడంలో సీసీ కెమెరాలు పోలీసులకు ఎంతో ఉపయోగపడతాయనే విషయం అందరికీ తెలిసిందే, అలాంటి సీసీ కెమెరాలు చుట్టూ బ్యానర్లు కట్టడం వలన రహదారి మార్గంలో జరిగే విపత్తులను, ఆకతాయిలు చేసే అల్లర్లను మరియు తప్పించుకు తిరిగే నేరస్తులను గమనించడంలో పోలీసులు ఎంతగా పర్యవేక్షిస్తున్నారో అందరికీ అర్థం అయ్యే పరిస్థితి కనపడుతుంది. ఇప్పటికైనా పోలీసులు, ఉన్నతాధికారులు స్పందించి సీసీ కెమెరాలు ఉన్న కూడలి ప్రాంతాలలో బ్యానర్లను తొలగించాలని, అలాంటి ప్రదేశాలలో బ్యానర్లు కట్టేందుకు అనుమతులు ఇవ్వకూడదని, అలా బ్యానర్లు కట్టే వారిని పోలీసులు శిక్షించే విధంగా ఉండాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

చెరువు ఆక్రమణపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట పంచాయతీ బిరుసువాడ రెవెన్యూపరిధిలో సుమారు 6 ఎకరాలు గల చెరువును కొంత మంది ఆక్రమించారని పట్టణ కోదండరామ ఆలయ కమిటీ చైర్మన్ బీన ఆనంద్, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు పొందూరు రాజు, టీడీపీ నేతలు కాంచన రాఘవదాసు, దున్న జోగారావు, మధుతో పాటు పలువురు మహిళలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో వెళ్లి తహశీల్దార్ అప్పలస్వామికి సోమవారం ఫిర్యాదు చేశారు. కొంత మంది పట్టణానికి చెందిన పెద్దలు రాజకీయ పలుకుబడులతో చెరువు విస్తీర్ణాన్ని సబ్ డివిజన్ చేయించి సుమారు 4 ఎకరాల స్థలం సొంతం చేసుకున్నారని ఆరోపించారు. మిగతా రెండెకరాల్లో రైల్వే ట్రాక్ పక్కన రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం చెరువు భాగంలో వెడల్పయిన రోడ్డు నిర్మించారని ఆరోపించారు. ఇటువంటి ఆక్రమణలు దర్జాగా జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం ఏమి పట్టించుకోకపోవడంతో రైతులు పొలాలకు, పంటలకు చెరువు నీరు అందక తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ చెరువుకు సంబంధించి వాస్తవాలు వెలికి తీయాలని తహశీల్దార్‌ను కోరారు.

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతులు అందాయి. నూతన ఫించన్లు మంజూరు చేయాలని, నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు అందుతున్నాయి. త్వరలో మంజూరు చేయడం జరుగుతుందని ప్రజలకు వివరించారు.ప్రజల నుంచి వచ్చిన వినతులు పరిశీలించి సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి త్వరిగతిన ప్రజలకు మేలు చేసేవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధులలో అలసత్వం లేకుంగా అధికారులు పనిచేయాలని సూచించారు.

ఎయిర్ పోర్ట్ నిర్మాణాన్ని స్వాగతిస్తున్నాం

విశాలాంధ్ర-పలాస: ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి స్వాగతిస్తున్నామని కూటమి ప్రభుత్వం నాయకులు, కొంత మంది రైతులు తెలిపారు. ఈ మేరకు సోమవారం పలాస ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ జి.వెంకటేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సాధ్యసాధ్యాలను అడిగి తెలుసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ విధి విధానాలు ఉద్దానం ప్రజలకు వివరించి వారి అభిప్రాయాలు సేకరించి సకాలంలో పూర్తి చేయాలని కోరామన్నారు. దీని పై ఆర్‌డిఓ జి.వెంకటేష్ సానుకూలంగా స్పందించి పోర్ట్ గ్రామాల్లో ప్రజలకు న్యాయం చేసి వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేసి సాయిల్ టెస్టింగ్ చేస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేస్తున్న వారిలో టీడీపీ నాయకులు దాసరి తాతారావు, బావన దుర్యోధన, కొర్ల కన్నారావు,జనసేన నాయకులు సంతోష్ పండా కూటమి నాయకులు రైతులు పాల్గొన్నారు.

23 కొత్తూరు లో శ్రీ అయ్యప్ప స్వామి మహా వడి పూజా మహోత్సవం

విశాలాంధ్ర-కొత్తూరు: ఈ నెల 23వ తేదీ న కొత్తూరు దరి కర్లెమ్మ గ్రామం పరిధి లో శ్రీ అయ్యప్పస్వామి మహా వడి పూజా మహోత్సవ కార్యక్రమం జనసేన నేత, సూడా చైర్మన్ కోరికాన రవికుమార్ ఆయన సతీమణి కోరికాన భవాని ల శారద్యం లో జరగనుంది ఈ ఏర్పాటు లు పై తమ అభిమానులు. పార్టీ ముఖ్య శ్రేణులు తో రవికుమార్ ఆదివారం రాత్రి కోరికాన కొత్తూరు విచ్చిశారు భారీ స్థాయి లో ఈ మహా వడి పూజా కార్యక్రమం నిర్వహిన కుఏర్పాట్లు చేయాలనీ తన శ్రేణులు తో జనసేన నేత కోరికాన చర్చించినట్లు సమాచారం.పాతపట్నం నియోజకవర్గం పరిధి లొ గల మండలాలు నుండి దీక్ష లో ఉన్న 2000 మంది అయ్యాప్ప స్వాములు కు ఈ మహా వడి పూజా కార్యక్రమానికి ఆహ్వానిస్తున్న ట్లు ఆ పార్టీ స్థానిక వర్గాలు తెలిపాయి ఇప్పటికే కొన్ని సేవా కార్యక్రమాలు ను రవికుమార్ ఆయన సతీమణి భవాని లు నియోజకవర్గం లొ నిర్వహిస్తున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చెయ్యాలి అని అలాంటి సేవా కార్యక్రమాల్లో భాగంగా గానే ప్రజల్లో తమ స్థానాన్ని పదిల పర్చుకోవడానికి పరిఛాయాలు పెంచు కోవడానికి ఆధ్యాత్మిక కార్యక్రమం శ్రీ అయ్యాప్ప స్వామి మహా వడి పూజా నిర్వహిస్తున్నారు అని రాజకీయ పరిశీలకులు విశ్లేస్తున్నారు ఏదియమైనా ఇది మంచి ఆధ్యాత్మిక కార్యక్రమం అని స్వాగతించాలి అని జనసైనికులు అంటున్నారు

కార్మికుల బకాయి జీతభత్యాలు తక్షణమే చెల్లించాలి

- సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో రావివలస సమీపంలో ఉన్న ఎంటర్ ప్రైజెస్ అండ్ ఎంటర్ ప్రైజింగ్ గ్రానైట్ కార్మికుల బకాయి జీతభత్యాలు తక్షణం చెల్లించాలని జిల్లా గ్రానైట్ మైన్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. ఎంటర్ ప్రైజ్ గ్రానైట్ కంపెనీ ఉత్పత్తి పనులు నిలుపుదల చేసిన తరువాత డ్రిల్లర్సుకు, కంపెనీ సిబ్బంది పనిచేసిన కాలానికి ఫుల్ అండ్ ఫైనల్ చెల్లించాల్సి ఉందని యూనియన్ ఆధ్వర్యంలో ముప్పది మంది కార్మికులుకు చెల్లించాల్సిన సొమ్ము లెక్కలుకట్టి ఏడాది కావస్తున్న చెన్నై లో ఉన్న యాజమాన్యం డబ్బులు పంపలేదని దీనితో రావివలస కార్మికులు టెక్కలి సిఐటియు కార్యాలయంలో సమావేశం జరిపి నిరసన తెలియజేసారు. విశాఖపట్నం సెంట్రల్ లేబరు అధికారులు కు ఫిర్యాదు పంపితే జరిగిన జాయింట్ సమావేశాలకు కూడా యాజమాన్యం హాజరు కాలేదు అని తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత యాజమాన్యాలకు అనుకూలంగా కార్మిక చట్టాల్లో మార్పులు చేయడం వల్ల సెంట్రల్ లేబరు అధికారులు మైనింగ్ కార్మికుల సమస్యలు పూర్తిగా పట్టించుకోవడం లేదన్నారు. దీనితో గ్రానైట్ కంపెనీలో బద్రత లేక తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి, కార్మికుల జీత బత్యాలు కూడా సక్రమంగా చెల్లించడం లేదని అన్నారు. తక్షణం కార్మికుల బకాయిలు చెల్లించాలని లేకుంటే ఆందోళన చేపడతామని కార్మిక సంఘ నాయకులు అన్నారు.

కార్యక్రమంలోకార్మికులుజోగబైరాగి,బెవరసూర్యనారాయణ,ఎ.వెంకటరావు,దాసరి నాగేసు, గున్న నర్సింహులు, అప్పిని క్రిష్ణ తదితరులు తెలిపారు.

సుభలయఆర్అండ్ఆర్ పంచాయతీ ని అభివృద్ధి చేశా

- సర్పంచ్ లంక రోజారాణి

విశాలాంధ్ర-హిరమండలం: 2021 ఫిబ్రవరి 9వ తేది న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో సుబలయ ఆర్ అండ్ ఆర్ కొలని పంచాయతీ సర్పంచ్ గా లంక రోజా రాణి గెలుపొందారు. సుబలయ ఆర్ అండ్ ఆర్ వంశధార నిర్వాశిత పంచాయతీ ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసానని సర్పంచ్ లంక రోజా రాణి సోమవారం వెల్లడించారు. ఈ సందర్భంగా విశాలాంధ్ర ప్రతినిధి శ్రీనివాస్ తో మాట్లాడుతూ 2020 సంత్సరం లో సుబలయ ఆర్ అండ్ ఆర్ పంచాయతీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, 2021సర్పంచ్ ఎన్నికల్లో 400 ఓట్లు మెజారిటీ తో గెలుపొందానని మొత్తం ఓటర్లు 1200మంది అని ఇప్పటి వరకు సుమారుగా 50 లక్షలు రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ లు, కల్వర్టు లు, త్రాగు నీటి సదుపాయాలు మొదలగు అభివృద్ధి పనులను పంచాయతీ నిధులతో వార్డు సభ్యులు సహకారం తో అభివృద్ధి చేసానని వెల్లడించారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రము అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా చెప్పు కొచ్చారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్య మంత్రి కొణెదల పవన్ కళ్యాణ్ సార్వత్రికా ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజలు మన్ననలు పొందుతున్నారని, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆశీస్సులు పంచాయతీ ప్రజలు ఆశీస్సుల తో మళ్ళీ పంచాయతీ సర్పంచ్ గా పోటీ చేస్తానని అభివృద్ధి ని చేశానని, పంచాయతీ ప్రజానీకం మళ్ళీ కోరుకుంటున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నా మామయ్య లంక రామారావు, నా భర్త లంక వెంకటరమణ మాస్టర్ లు అను నిత్యం ప్రజలు కష్టసుఖాల్లో ఉంటూ పంచాయతీ ఓటర్ల మన్ననలు పొందుతున్నారని మంచి వ్యక్తి త్వం ఉన్న మా కుటుంబం ను ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పై అనునిత్యం పోరాటం చేస్తున్నామని అన్నారు. సుబలయ ఆర్ ఆర్ పంచాయతీ కి అన్ని మౌళిక వసతులు ను కల్పించానని స్త్రీ శక్తి భవనం ను త్వరలో నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నానని తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ లో క్రియాశీల నాయకులు గా టీడీపీ పార్టీ కోసం అనునిత్యం పార్టీ బలోపేతం నకు కృషి చేస్తున్నానని వెల్లడించారు.

మల్లేశ్వర స్వామిని దర్శించుకున్న దేవాదిశాఖ జిల్లా సహాయ కమిషనర్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: స్థానిక రెడ్డిక వీధిలో ఉన్న శ్రీ మల్లేశ్వర స్వామిని జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ బి.ఆర్.వి.వి. ప్రసాద్ పట్నాయక్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి ఆలయ విశిష్టితను ఆయనకు వివరించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో జగదీశ్వర స్వామి ఊరేగింపు

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం జగతి గ్రామంలో వెలసి ఉన్న జగదీశ్వరస్వామి వారి ఊరేగింపు గ్రామంలో భక్తిశ్రద్ధలతో చేపట్టారు.జగతి గ్రామానికి చెందిన కీర్తిశేషులు శమల్ల శంకరరావు కుటుంబ సభ్యులు సమీర్, వేదవ్యాస్ల ఆధ్వర్యంలో జగదీశ్వర స్వామికి కార్తీక సోమవారం సందర్భంగా పల్లకి లో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు ఉచిత ప్రసాద పంపిణీ

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలోని రావివలస గ్రామంలో వెలసినటువంటి శ్రీ శ్రీ శ్రీ ఎండల మల్లికార్జున స్వామి కార్తీక మాసం 4వ సోమవారం సందర్భంగా ఇతర మండలాల, రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులకు జనసేన శ్రేణులు ఉచిత ప్రసాదం మరియు త్రాగునీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కూరాకుల యాదవ్, జిల్లా కార్యదర్శి మెట్ట అవినాష్, సలాషణ షణ్ముఖ, సంయుక్త కార్యదర్శి అనపాన జనార్ధన రెడ్డి మరియు జనసేన శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమానికి 53 ఫిర్యాదులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో స్వీకరించే పిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తి స్థాయిలో విచారణ జరిపి పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ "ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా వృద్ధులు, దివ్యాంగులు వద్దకు జిల్లా ఎస్పీ స్వయంగా వెళ్లి వారి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పలు ప్రాంతాలు నుండి వచ్చిన 53 మంది ఫిర్యాదు దారులతో జిల్లా ఎస్పీ ముఖముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి వివరంగా అడిగి తెలుసుకుని ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదుల గురించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితలకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఫిర్యాదులన్నింటిపై తీసుకున్న పరిష్కార చర్యలు, పూర్తి వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి అందజేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, మోసాపూరీతమైనవి,ఆస్తి తగాదలు, కొట్లాట, ఇతరత్రా సమస్యల పై 53 ప్రజా పిర్యాదులు స్వీకరించడం జరిగిందన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రజకుల అభివృద్ధి సాధ్యం

- రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము

విశాలాంధ్ర-రణస్థలం: కూటమి ప్రభుత్వం పాలనలోనే రజకుల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము తెలిపారు. ఆదివారం విజయనగరం జిల్లా కేంద్రంలో జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాము మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆదరణ శ్రీ పథకం ద్వారా రజక వృత్తిదారులకు ఆధునిక సాంకేతిక తో కూడిన పరికరాలను అందించుట కొరకు వృత్తిదారులు, బీసీలు కొరకు రూ 1000 కోట్లు బడ్జెట్ ఏర్పాటు చేసిందని ఆదరణ శ్రీ పనిముట్లను రజక వృత్తిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విజయనగరం జిల్లా రజక సంఘం నాయకులు అప్పికొండ, సన్యాసిరావు, తంగేటి భాస్కరరావు, మడిచర్ల చిట్టితల్లి, జంప చిన్న, నొపడ రామారావు, గన్రెడ్డి సింహాచలం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా రజకులకు రక్షణ చట్టం ఎస్సీ రిజర్వేషన్ కల్పిస్తామని హామీని అమలు చేసి రజకులను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రజకులకు ఎటువంటి రక్షణ చట్టం లేకపోవడం వల్ల గ్రామాల్లో పట్టణాల్లో ఉన్న రజకులపై దాడులు దౌర్జన్యాలు మానభంగాలు జరుగుతున్నాయని వారు గుర్తు చేశారు. ఇప్పటికే 18 రాష్ట్రాలు నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ రిజర్వేషన్ లో ఉన్నారని ఒకే దేశం ఒకే సామాజిక వర్గం అయినటువంటి రజకులకు ఒకటే ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని విన్నవించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మడి పిల్లి రాజారావు, రాజ మహేంద్రపు ఈశ్వరరావు, కోనాడ పైడిశెట్టి, పట్టణ అధ్యక్షుడు కొవ్వూరి అప్పలరాజు, ఆర్ సురేష్, ముత్యాల సతీష్, జంపా నాగరాజు, కొల్లేటి శ్రీను, కోనాడ సతీష్, నగిరి కట్ట సన్యాసిరావు, జంప శంకర్రావు, గుమ్మడి సత్తిబాబు, కొవ్వూరి జగదీష్, సత్తివాడ సురేష్, కొవ్వూరి రమేష్, జంప శ్రీను, డమర్ సింగ్ సూర్యనారాయణ, మద్ది పైడి అప్పడు, గుమ్మడి సింహాచలం, బాదం రవణ, కొల్లేటి రాంబాబు, రాసపల్లి రమణ, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-టెక్కలి: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు గ్రంథాలయాలు వాటి ప్రయోజనాలు అనే అంశమ్ పై వ్యాసరచన పోటీలు ప్రధాన ఉపాధ్యాయులు డి దాశరధి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల ద్వారా ఎంతో విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని అన్నారు. ఖాళీ సమయాలలో గ్రంథాలయాలలో ఉన్న పుస్తకాలను చదువుకొని తమ మేధాశక్తిని మరింత పెంచుకోవాలని సూచించారు. అక్కడ అన్ని రకాల పుస్తకాలు ఉంటాయని, ప్రతిరోజు ఒక పుస్తకాన్ని చదివినట్లయితే రానున్న రోజుల్లో వాటి ఉపయోగం తెలుస్తుందని అన్నారు. ఈ వ్యాసరచన పోటీలు బి.అరుణ కుమార్, జి.అలివేణి, గ్రంథాలయ అధికారిణి బి.రూపవతి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ

ఏపిఎం పైడి కూర్మారావు

విశాలాంధ్ర-మందస: గ్రామాలలో మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా సాంప్రదాయ పద్ధతిలో పండించిన కూరగాయలు తదితర ఉత్పత్తులకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుందని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్ ను పరిశీలిస్తూ మాట్లాడారు. వారు గ్రామాల నుండి తెచ్చిన తాజా ఆకుకూరలు, పండ్లు, కాయగూరలు మొదలగు అన్ని ఉత్పత్తులు కూడా కేవలం ఒక గంట కాలం లోపే అమ్ముడుపోతూ, మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు పండించిన మహిళా రైతులతో పాటు మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం బొరివంక సబ్స్టేషన్ పరిధిలో 11కేవీ ఫీడర్ నందు ఆర్డిఎస్ఎస్ పనులు నిమిత్తం బుధవారం సబ్స్టేషన్ పరిధిలోని గ్రామాలైన బొరివంక, గుడ్డి మీదవీధి, బొగిడియాపుట్టుగ, మునిపుట్టుగ, దూగానపుట్టుగ, కొర్రాయిపుట్టుగ, తుంగానపుట్టుగ గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస విద్యుత్తుశాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రటనలో తెలిపారు.గృహ,వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పారిశుద్ధ్యంపై శిక్షణ

విశాలాంధ్ర-కవిటి: జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు గ్రామాల్లో పారిశుధ్యం,పరిశుభ్రతపై కవిటి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయింత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎల్.త్రినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సర్పంచ్లు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

అక్రమ కేసుల నమోదుకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన

విశాలాంధ్ర - పోలాకి : మండలంలో పిన్నింటిపేట వైయస్సార్ విగ్రహం ఎదుట కొవ్వొత్తుల ప్రదర్శన సోమవారం సాయంకాలం నిరసన చేపట్టారు. మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నరసన్నపేట పట్టణంలో శాంతియుతంగా చేపట్టిన నిరసన ర్యాలీ చేపట్టారు. యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య తోపాటు పలువురి నాయకుల్ని అక్రమ కేసులు పెట్టడంపై యువజన, విద్యార్థి విభాగాలు తీవ్రంగా ఖండించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కూటమి ప్రభుత్వ విధానాన్ని శాంతియుతంగా నిరసన ర్యాలీ చేపట్టడం తప్పా వైద్య విద్యను అభ్యసించి పోలాకి జెడ్పీటీసీ గా రాజకీయ రంగంలో దూసుకుపోతున్న డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పై అక్రమ కేసు బనాయించడం సరికాదు అన్నారు. వైద్యవిద్య ప్రైవేటుపరం చేస్తే పేదోడికి వచ్చిన ఇబ్బందులు తెలిసిన వ్యక్తిగానిరసన ర్యాలీ చేపడితే అక్రమంగా కేసు నమోదు చేయడం పై వీరు తీవ్రంగా ఖండించారు. అక్రమ కేసు వెంటనే ఎత్తివేయాలని వీరు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కార్యదర్శి చింతు రాఘవ,నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు సాలిన నగేష్, వైస్ ఎంపీపీ కలగదండు తాతారావు, మండల యూత్ అధ్యక్షులు రెంటికోట త్రినాధరావు , మండల బూత్ కమిటీ అధ్యక్షులు చింతాడ ఉమా మహేశ్వరరావు, మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు బెండి శ్రీనివాస్, మండల బీసీ సెల్ అధ్యక్షులు చింతు రామకృష్ణ, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు గుంటు గణేష్ ,మండల ఉప అధ్యక్షులు రాయల మల్లేశ్వరరావు, ఎంపిటిసి పైల మల్లేశ్వరరావు,మండల యూత్ ఉప అధ్యక్షులు బమ్మిడి రాజు , తలగాన మన్మధరావు , అప్పినిచిట్టి , పాలిన నర్సింగరావు , చింతాడ

ఎండల మల్లన్నను దర్శించుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి

విశాలాంధ్ర-టెక్కలి: కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా టెక్కలి మండలం రావివలస గ్రామంలో ఉన్న ఎండల మల్లికార్జున స్వామిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కింజరాపు విజయ మాధవి తో కలిసి దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.గురునాథ రావు ఆలయ సంప్రదాయంతో మంత్రిని సాదర స్వాగతం పలికారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు వేదమంత్రాల నడుమ తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఖండించిన వైసిపి లీగల్ సెల్

విశాలాంధ్ర - నరసన్నపేట: ఇటీవల పోలాకి జడ్పిటిసి, డా. ధర్మాన కృష్ణ చైతన్య పై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తున్నామని వైసిపి, లీగల్ సెల్ సభ్యులు అన్నారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో లీగల్ సెల్ ప్రతినిధులు, జి. సత్యనారాయణ, జీవివి గణేష్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురి చేసే నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీ కరించడంపై నిరసన తెలియజేస్తే కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు అక్రమంగా కేసులు పెట్టడం సరికాదన్నారు. పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించకుండా, పెత్తందారులకు మెడికల్ కళాశాలల ను కట్ట పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, దీనిని వ్యతిరేకిస్తే డాక్టర్ కృష్ణ చైతన్య పై కేసులు పెట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రశాంతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా ధర్నా నిర్వహిస్తున్న వైసిపి కార్యకర్తలపై పోలీసులు కేసులు పెడితే, చట్టపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటారని అన్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోని వైసిపి కార్యకర్తలకు లీగల్ సెల్ అండగా ఉంటుందని గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ ప్రతినిధులు, మొజ్జాడ శ్యామల రావు, బోర జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

పలాస కాశీ బుగ్గ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ గా ఐ. శ్రీనివాసులు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.గుంటూరు జిల్లా పొన్నూరు మున్సిపాలిటీలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ విధులు నిర్వహిస్తున్న ఐ. శ్రీనివాసులు పదోన్నతి పై పలాస మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించారు. పలాస లో కమిషనర్ గా అంతకు ముందు పనిచేసిన నడిపేన రామారావు విజయనగరం మున్సిపాలిటీకి శానిటేషన్ ఇన్స్పెక్టర్ గా నడిపేన రామారావు బదిలీ అయ్యారు. కొత్తగా పదవి బాధ్యతలు చేపట్టిన పలాస మున్సిపల్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుతో పుష్పగుచ్ఛంతో కలిసి అభినందనలు తెలిపారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులు డి. ఈ కనకరాజు, అన్ని విభాగాల ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కమిషనర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చేందుకు అధికారుల సహకారంతో ముందుకు వెళ్తానని అన్నారు. మున్సిపాలిటీలో సిబ్బంది కొరత ఉందని తన దృష్టికి వచ్చిందని, పరిష్కరించేందుకు ఇప్పటినుంచి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు సలహాలు సూచనలతో మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసేందుకు దృష్టి సారిస్తానని అన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటారని తన మార్క్ పరిపాలనను అందిస్తానని తెలిపారు. జంట పట్టణాల్లో ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా ఉందని వాటి నివారణకు కృషి చేస్తానని అన్నారు. దీనికి ప్రజల సహకారం కావాలని కోరారు.

గ్రీవెన్స్ కు గైర్హాజరు అవుతున్న అధికారులకు లేఖలు

విశాలాంధ్ర-మందస: స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరుగుతున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి పలు శాఖల అధికారులు నెలలు తరబడి పూర్తిగా హాజరు కావడం లేదు. ఇక్కడ జరుగుతున్న గ్రీవెన్స్ కు తహసిల్దార్ మిస్కా శ్రీకాంత్ ఎంపీడీవో వై వెంకటరమణ హాజరవుతున్నారే తప్ప మిగిలిన శాఖల అధికారులు హాజరు కావడం లేదు సరి కదా గ్రీవెన్స్ కు పూర్తిగా దుమ్మా కొడుతున్నారు. కొన్ని శాఖల అధికారులు అయితే కార్యాలయంలోని అటెండర్ లను కింది స్థాయిలో పనిచేస్తున్న సిబ్బందిని ఒప్పంద ఉద్యోగులను గ్రీవెన్స్ కార్యక్రమానికి పంపడం ఇక్కడ ఆనవాయితీ గా వస్తుంది.దీంతో తహసిల్దార్ మిస్కా శ్రీకాంత్ గ్రీవెన్స్ కు నెలలు తరబడి రాకుండా కార్యాలయంకు పరిమితం అవుతున్న పలు శాఖల ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీవెన్స్ కు పూర్తిగా హాజరుకాని అధికారులు అందరికీ సమాధానాలు కోరుతూ లేఖలు పంపాలని డిటి కే రామకృష్ణను ఆయన ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహిస్తుందని అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి సహకరించాలని ఆయన కోరారు.

అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

విశాలాంధ్ర-కవిటి:కవిటి మండలం జగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లెక్కలు ఉపాధ్యాయునిగా పని చేస్తున్న కవిటి గ్రామానికి చెందిన పాండవ కిరణ్ (46) గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. మృతునికి భార్య జోత్స్న తోపాటు ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. మృతుడు కిరణ్ ఉపాధ్యాయ వృత్తికి ఎనలేని సేవలు అందించాలని మనలో ఉపాధ్యాయులు గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయులు, ఆయన శిష్యులు ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ కన్నీటి వీడ్కోలు పలికారు.జగతి పాఠశాలలో, స్వగ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అక్రమ నిర్మాణాలు ఆగేదెన్నడు..

- యదేచ్చగా నిబంధనలు ఉల్లంఘన
- చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ విభాగం!

విశాలాంధ్ర - శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో యదేచ్చగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నిబంధన ప్రకారం కార్పొరేషన్ టౌన్ ప్లాన్ విభాగంలో నిర్మాణదారులు ప్లాన్ అనుమతులు పొందిన తరువాత మాత్రమే నిర్మాణాలను సాగించాల్సి ఉంటుంది. ఆనపత్తులు పొందిన ప్లాన్ మేరకు ఎటువంటి ఉల్లంగనలు జరగకుండా నిర్మాణం జరిగే విధంగా టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యే పరిస్థితులు ఇక్కడ ఏర్పడ్డాయి. నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాలంటే ప్లాన్ వేసింది మొదలు అనుమతులు అయ్యేవరకు మధ్యకాలంలో చాలా పెద్దతతంగమే నడుస్తుంది. ఈ మామూలు వ్యవహారం లక్షల్లో ఉండడంతో నిర్మానుదారులు మధ్య మార్గంగా దళారులు ద్వారా ఒప్పందాలు కుదుర్చుకుని కొంతమంది టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది చేతికి అందజేస్తుండడంతో ఈ అక్రమ నిర్మాణాలు దందా నగరంలో పెద్ద ఎత్తున జరుగుతోందని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. సచివాలయాల స్థాయిలో కొందరు ప్లానింగ్ సెక్రటరీలు ఈ అవినీతి కార్యకలాపాలకు ప్రధాన సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. 50 డివిజన్లో పరిధిలోను ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు ప్లాన్ కు విరుద్ధంగా జరుగుతున్న కట్టడాలు అడుగడుగునా దర్శనమిస్తున్నప్పటికీ వాటిపై కనీస స్థాయి చర్యలు లేకపోవడం వెనుక చేతులు మారుతున్న పచ్చ నోట్లు ప్రభావం ప్రధానమైనదని విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలు వివరాలు, ఎంత మొత్తంలో నిర్మాణదారుల నుండి లంచాలు వసూలు చేయాలో ఒకరి నుండి మరొకరు చెప్పుకునేందుకు వార్డు ప్లానింగ్ సెక్రటరీలు కొందరు ఒక వాట్సాప్ గ్రూపుని ఏర్పాటు చేసుకుంటున్నారు అంటే ఈ దందా ఏ స్థాయిలో జరుగుతుందో ఇట్టే ఊహించుకోవచ్చు. ఈ అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వెళ్లిన కనీస స్థాయిలో స్పందించడం పక్కన పెడితే ఫిర్యాదుదారులపైనే వేధింపులకు గురి చేసిన సందర్భాలు కూడా ఇటీవల కాలంలో జోరుగా జరుగుతున్నాయి అన్న పుకార్లు నగరంలో షికారులు చేస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు, నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు స్పందించి నగరంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల పట్ల ప్రత్యేక శ్రద్ధను చూపించి వాటికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

నవ్యాంధ్రకు నూతన శకం ఆరంభం సీఐఐతో శ్రీకారం

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మక వేదికగా విజయవంతంగా పూర్తైన విశాఖ సిఐఐ సమ్మిట్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభివర్ణించారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ను పెట్టుబడుల హబ్‌గా మార్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చేపట్టిన వ్యూహాత్మక కృషికి ఈ సదస్సు ప్రత్యక్ష ఫలితమని తెలిపారు. గత ఐదేళ్లలో విధ్వంసకర విధానాలతో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన ప్రధాన కంపెనీలు కూడా, కొత్త ప్రభుత్వంలోని స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పద్ధతులకు ఆకర్షితులై తిరిగి ఆంధ్రప్రదేశ్ వైపు మళ్లిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. రెండు రోజుల్లోనే భారీ ఎత్తున పెట్టుబడులు రావడం, 613 ఒప్పందాల ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16 లక్షలకుపైగా ఉద్యోగాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చాటుతున్నాయని అన్నారు. సదస్సు మొదలుకాకముందే రూ.3.65 లక్షల కోట్ల కొత్త పెట్టుబడులు రావడం, 35 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం రాష్ట్రంపై పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. తొలి రోజు ఒక్కరోజే రూ.8.26 లక్షల కోట్ల భారీ ఒప్పందాలు నమోదవడం చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి మళ్లీ ట్రాక్ పైకి వచ్చిందని అచ్చెన్నాయుడు అన్నారు. పెట్టుబడుల సునామీతో ఆంధ్రప్రదేశ్ మళ్లీ భారతదేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ: మంత్రి అచ్చెన్న



విశాలాంధ్ర-కోటబొమ్మాళి/టెక్కలి: అన్నదాత సుఖీభవ' పథకాన్ని ఈ నెల 19న రెండో విడత నిధులు జమ చేయనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం టెక్కలి నియోజకవర్గంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయం నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి , డైరెక్టర్, 26 జిల్లాల జేడీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు సూచలను అధికారులకు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులు అదేరోజు విడుదల చేయనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా కలిపి రైతుల ఖాతాల్లో జమ చేయనున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాతో కలిపి మొత్తం రూ.7వేలు అందించనున్నామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందాలని, రైతులకు చేయూతనివ్వడం భారం కాదు.. బాధ్యత అని గుర్తెరగాలని అన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం రెండో విడత అమలు కార్యక్రమం పండుగ వాతావరణంలో జరగాలని అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 19న వైయస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద రెండో విడత 46,62,904, లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుందని అధికారులు మంత్రికి వివరించారు.

ఓర్వలేకే దాడులకు ప్రోత్సహిస్తున్న అచ్చెన్న

- భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు
- వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్

విశాలాంధ్ర-టెక్కలి: ప్రజల నుండి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గ్రామాలలో దాడులకు ప్రోత్సహిస్తున్నారని వైసిపి టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్ ఆరోపించారు. మండలంలోని స్థానిక వైసిపి పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ అధికారమధంతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పోలీసులను అడ్డుపెట్టుకొని దాడులకు ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఇదే కొనసాగితే భవిష్యత్తులో టిడిపి నాయకులు, కార్యకర్తలు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. మాపై ఎన్ని కేసులు పెట్టినా మా ఆర్థిక మూలాలను దెబ్బ కొట్టినా భయపడే ప్రసక్తి లేదన్నారు. అచ్చెన్నాయుడు వారి కుటుంబ సభ్యుల అవినీతిని వెలికి తీసి ప్రజలకు వివరిస్తుండడంతో ఓర్వలేక మాపైన మా కార్యకర్తల పైన దాడులకు పాల్పడుతూ కేసులు పెడుతున్నారన్నారు. అచ్చెన్నాయుడు ది దాడుల సంస్కృతి అని, దిగజారుడు రాజకీయాలతో గ్రామాల్లో ప్రజల మధ్య గొడవలు సృష్టించి తాను రాజకీయ లబ్ధిపొందాలని ప్రయత్నిస్తుంటారు అని, ఇదే కొనసాగితే తగిన బుద్ధి చూపిస్తామని సవాళ్లు చేశారు. ఒక్క సంతబొమ్మాళి మండలం లోనే జగన్మోహన్ రెడ్డి హయాంలో సంక్షేమ పథకాల ద్వారా 500 కోట్లు ప్రజలకు నేరుగా వేయడం జరిగిందనీ, 4600 కోట్ల పైబడి నిధులతో మూలపేట పోర్ట్ నిర్మాణం చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. ఒక్క కాపుగోదాయవలస లోనే ఐదు కోట్లతో రాజకీయాలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు అందజేయడం జరిగిందని తెలిపారు. ఇది కాదనే దమ్ము ధైర్యం ఏ ఒక్క టిడిపి నాయకుడికైనా ఉందా అని సవాళ్లు విసిరారు. 40 ఏళ్ళుగా రాజకీయ పదవులు అనుభవిస్తున్న అచ్చెన్నాయుడు ఈ నియోజకవర్గానికి ఒక్క శాశ్వత పథకమైన చేపట్టారా అని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో ఐదేళ్లలో నియోజకవర్గంలో సుమారు 2000 కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాల అమలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. దమ్ముంటే దీనిపై అచ్చెన్నాయుడు చర్చకు రావాలని, మీ హయాంలో అభివృద్ధి, సంక్షేమం జరిగిందో జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిందో చర్చిద్దాం రండని ప్రశ్నించారు. టిడిపి నాయకులు కార్యకర్తలు భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం నిర్మిద్దాం

విశాలాంధ్ర-కవిటి: ఎయిడ్స్,టిబి రహిత సమాజం నిర్మించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జోనల్ సూపర్ వైజర్ పి.సుధాకర్ అన్నారు. ఈ మేరకు సోమవారం కవిటి మండలం బసవ కొత్తూరు గ్రామంలో చైల్డ్ ఫండ్, ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదని, అలాగే సైబర్ నేరాలు, అక్రమ డ్రగ్స్, గంజాయి రవాణాపై అవగాహన కల్పించారు. అలాగే 48 మందికి హెచ్ఐవి రక్త పరీక్షలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వాసుదేవరావు, ఎంపీటీసీ సంతోష్ పట్నాయక్, సి ఎల్ డబ్ల్యు జి రవి, గ్రామస్తులు పెద్దిరెడ్డి,బసవరాముడు, ఆశ వర్కర్ జయమ్మ, అంగన్వాడీ కార్యకర్త శారద, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యాతా శిబిరంలో బీఆర్‌యూ బృందం ప్రతిభ

విశాలాంధ్ర, ఎచ్చెర్ల: మహర్షి దయానంద్ యూనివర్సిటీ నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొని ప్రతిభ కన్బరిచిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ బృందానికి సోమవారం వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అభినందించారు. ఈ బృందా నికి సమన్వకర్తగా వ్యహరించి జాతీయ స్థాయిలో ఉత్తమ టీమ్ లీడర్గా , కంటిజెంట్ లీడర్ గా అవార్డులు అందుకున్న పీవో డాక్టర్ కె.కరుణానిధిని అభినందించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, విశిష్టత, ఆచార వ్యవహారాలు వంటివాటిని వర్సిటీ బృ ందం ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. జి.స్రవంతి (కూచిపూడి), ఎస్. భార్గవి (దేశ సంకల్ప్ స్కిట్)ను ప్రదర్శించారు. క్రీడా విభాగంలో కె. పవన్ అండ్ కో, ఎం. పవిత్ర, జి.రవితో కలిసి టగ్ ఆఫ్ వార్ ఈవెంట్లలో, జి.చంద్రశేఖర్ (గిరిజన సంప్రదాయ వస్త్రధారణ) తో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. అరుణకుమారి, పీవోలు టి. భవాని, బి. వ్యాసగీత తదితరులు పాల్గొన్నారు.

నీలమణి దుర్గమ్మ ఆలయంలో కుంకుమార్చనలు

విశాలాంధ్ర-పోలాకి: మండలంలో చెల్లాయివలస గ్రామంలో సోమవారం కార్తీకమాసము సందర్భంగా శ్రీశ్రీశ్రీ నీలమణి దుర్గమ్మ వారి 11 వార్షికోత్సవం సందర్భంగా ఆ గ్రామములో ఉన్న మహిళలుకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకమ పూజలు నిర్వహించినట్లు గురు భవాని శలపాక ఈశ్వరరావు గురు భవాని తెలిపారు. ఈ మేరకు మహిళలు కోలాటం ఆడారు. అనంతరం భవాని భక్తులుతో పాటు పరిసర గ్రామవాసులుకు అన్న సమారాధన అందించారు.

రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వం ధ్యేయం

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: రైతు శ్రేయస్సే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం వజ్రపుకొత్తూరు లో రూ. 28 లక్షల వ్యయంతో నిర్మించనున్న పిఎసిఎస్ అదనపు భవనాలకు శంకుస్థాపన చేసారు. పిఎసిఎస్ చైర్మన్ కణితి సురేష్ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ రైతు సేవలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని అన్నారు. సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార నీరు అందించి రైతులను ఆదుకుందని అన్నారు. రైతులు పండించిన పంటను రైతు సేవా కేంద్రాలు ద్వారా కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి ఖాతాల్లో కి నగదు జమ చేస్తుందని, రైతులకు పంట రుణాలు అందించి ఆదుకుంటుందని అన్నారు. రైతు సంక్షేమం విషయంలో రాజీ లేదన్నారు. అంతకు ముందు పిఏసిఎస్ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, సిఈఓ సత్యనారాయణ, తహసీల్దార్ సీతారామయ్య, ఎంపీడీవో ఎన్. రమేష్ నాయుడు, వ్యవసాయాధికారి బమ్మిడి ధనుంజయ, పి. విఠల్, ఎఎంసి చైర్మన్ వంకల కూర్మారావు, బి. శశిభూషణ్, దుంపల వల్లభరావు, తిమ్మల కృష్ణారావు, డైరక్టర్ లు రాపాక శాంతారావు, అప్పారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నయనానందం... తిరువీధి మహోత్సవం

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట పట్టణంలో శ్రీశయన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన మహాశివుని తిరువీధి మహొత్సవం నయనానంద కరంగా అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణంలోని 18 శ్రీశయన హుండీలతో కలిసిన శ్రీశయన సంఘం పెద్దల నేతృత్వంలో జరిగిన ఈ మహొత్సవం పట్టణ శివారున శ్రీవిజయదుర్గా ఆలయం వద్ద ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువ కప్పి సన్మానించారు. అక్కడ నుంచి మొదలైన తిరువీధుల మహొత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనగా మహిళల కోలాటం, భజన బృందాలతో సాంస్కృతిక ప్రదర్శనలు, శివపార్వతుల వేషధారణలు, బాణాసంచా కాల్పులతో పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మెయిన్‌రోడ్డు గుండా సాగిన ఈ శోభాయాత్ర మంగళవీధి గుండా టౌన్‌హాల్ వీధి నుంచి మళ్లీ మెయిన్‌రోడ్డుకు వెళ్లి అక్కడ నుంచి పెద్దకోమటి వీధి, శ్రీశయన వీధుల గుండా నింభాషిణి ఆలయం వద్ద ముగిసింది. వేలాదిగా భక్తులు పాల్గొన్న ఈ శోభాయాత్రలో శ్రీశయన సంఘాల సభ్యుల ప్రత్యేక వస్త్రధారణ ఆకట్టుకుంది. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు పెద్ద ఎత్తున ఫలహారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రెల్ల నారాయణరావు, హుండీల పెద్దలు, ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనధికారిక భవనాలను క్రమబద్ధీకరించుకోండి

- మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస పురపాలక సంఘ పరిధిలో అనధి కార భవనాలను క్రమబద్ధీకరణ చేసుకోవాలని కమి షనర్ తమ్మినేని రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రభుత్వం జిఓ ఎంఎస్ నెంబర్ 225 ను విడుదల చేసింది.1985 జనవరి నుంచి 2025 ఆగస్టు 31 వరకు నిర్మాణం పూర్తయిన నివాస, వాణిజ్య భవన నిర్మాణాలకు ప్లాన్ కు డివియేషన్ ఉన్న అన్ని భవన నిర్మాణాలకు రెగ్యులరైజేషన్ చేసుకొనేందుకు నవం బర్ 14 నుంచి 120 రోజులు 2026 మార్చి 11 వర కు పట్టుకొచ్చియట గేట్లో వేయట్లేదు ఆన్లైన్ ద్వారా గాని ఎల్ టి పి ద్వారా గాని దరఖాస్తు చేసుకోవచ్చని ఆ ప్రకటనలో వివరించారు. 120 రోజులు పాటు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పురపాలక సంఘ పరిధిలోని భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు, గడ్డలు, చెరువులు, బండలు మాస్టర్ ప్లాన్ లేని లేఔట్ ఓపెన్ ప్లేస్ లోని భవనాలు నిర్మించిన వారు ఈ క్రమ బద్ధీకరణకు అనర్హులని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్...బాధిత కుటుంబాలకు భరోసా: ఎమ్మెల్యే నడుకుదిటి

విశాలాంధ్ర,ఎచ్చెర్ల: సీఎం రిలీఫ్ ఫండ్తో బాధిత కుటుంబాలకు భరోసా నిస్తున్నట్టు స్థానిక శాసనసభ్యుడు నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలం తోటపాలెం గ్రామంలో వివిధ గ్రామాలకు చెందిన ఆరు బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక ్కలను సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, కూటమి నేతలు విశ్వక్సేన్, బెండు మల్లేశ్వరరావు, గూరు జగపతిబాబు, సంపతిరావు నాగేశ్వరరావు, గట్టెం శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అగ్నిమాపక అధికారికి గాయాలు

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట అగ్నిమాపకశాఖ ఎస్సైగా పని చేస్తున్న ఏ.సూర్యారావు సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. టీచర్స్ కాలనీలో ఆయన స్వగృహం నుంచి మెయిన్‌రోడ్డుకు వెళుతుండగా మెయిన్‌రోడ్డులో ఇద్దరు విద్యార్థులు బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొనడంతో రోడ్డుపై పడిన సూర్యారావుకు తలకు, కాలికి, చేతికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే సామాజిక ఆసుపత్రికి తీసుకు వెళ్లగా వైద్యులు, సిబ్బంది వెంటనే ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్సై లోవరాజు, సిబ్బంది కలిసి గాయాలైన సూర్యారావును, అలాగే సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

పలాస ఆర్డిఓ జి.వెంకటేష్

విశాలాంధ్ర-పలాస: ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని పలాస ఆర్ డి ఓ జి వెంకటేష్ అన్నారు.సోమవారం పలాస ఆర్డీవో కార్యాలయంలో సబ్ డిస్ట్రిక్ట్ మల్టీ లెవెల్ అప్రోపియట్ అథారిటీ అడ్వైజరీ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి స్కానింగ్ సెంటర్ వచ్చే గర్భిణీ స్త్రీల పేర్లు నమోదు చేసి ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. గర్భిణీ స్త్రీల వివరాలు నమోదు చేయాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ నందు సిసి కెమెరాలు పర్యవేక్షణ సక్రమంగా ఉండాలని, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. ఫారం ఎఫ్ లను విధిగా అప్లోడ్ చేయాలన్నారు కార్యక్రమంలో డిప్యూటీ వైద్యాధికారి మేరీ కేథరిన్ డాక్టర్ నాగ సుశీల శివరంజని, .ఎర్రన్న కోఆర్డినేటర్ మోహిని రత్నకుమారీ, చైల్డ్ లైన్ బాల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరికి సోకే తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర, ఎచ్చెర్ల: శ్రీ కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల (ఎస్ఎస్ఆర్పురం) ఆధ్వర్యంలో మండలం ధర్మవరం గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా సోమవారం రైతులకు కొబ్బరి సోకే తెగుళ్లపై అవగాహన కల్పించారు. కొబ్బరిలో కొమ్ము పురుగు, ఎర్ర ముక్కు పురుగు, ఇథియోఫిడ్ నల్లి, సర్పిలాకారపు తెల్ల దోమను గుర్తించి వాటికి తీసుకోవల్సిన జాగ్రత లను వివరించారు. కొమ్ము పురుగుకు నాప్తలీన్ గోళీలు కొమ్మకు అటు ఇటు వైపు ఒకటి. అలాగే క్లోరాంత్రనిలిప్రోల్, సాచేట్లను పెట్టాలని సూచించారు. ఎర్రముక్కు పురుగు ఉధృతంగా ఉంటే ఇమిడాక్లోమిడ్ -1 మి.లీ/లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కొమ్ము పురుగు, ఎర్రముక్కు పురుగుకు బకెట్ ట్రాప్లను 1 హెక్టార్కి 2 చెప్పున పెట్టాలన్నారు. సర్పిలాకారపు తెల్లదోమకు పసుపు రంగు జిగట ముచ్చెలను కట్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ నారన్నాయుడు, కళాశాల సిబ్బంది డాక్టర్ దేవికరాణి, భవాని, డాక్టర్ సత్యన్నారాయణ, శివానీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.